# 7
# ముళ్ళు

*నాకెందుకో మామయ్య ముఖం చూస్తుంటే ముసలి తోడేలు జ్ఞాపక మొస్తోంది. ఆ కళ్ళు నాకెప్పుడూ తోడేలు కళ్ళలాగే కన్పిస్తాయి. ఆ కళ్ళల్లో పాశవికత తప్ప మానవత్వం కన్పించదు.*

"ప్చ్ కష్టం... ఈ యుద్ధాన్ని ఆపడం చాలా కష్టం," మెలకువతో పాటుగా ఈ మాట కూడా నా నోట్లోకి వచ్చేసింది.

ఆకాశంలో అలల్లా కదులుతూ వెళుతోన్న మబ్బుతునకలు ఏవేవో విషాదగాథల్ని మోసుకుపోతున్నట్లుగా వున్నాయి.

విడిపోతున్న చీకట్లను కమ్ముకుంటూ మంచు పొగలుపొగలుగా తెరిచి వుంచిన కిటికీలో నుండి గది లోపలికీ, గుండెల్లోపలికీ కూడా విస్తరిస్తున్నట్లుగా వుంది.

బరువుగా కనురెప్పలు వాలిపోతున్నాయి. తెరవాలన్పించడం లేదు. తెరిస్తే పక్క మంచం మీది శూన్యాన్ని భరించడం కష్టం.

రాత్రి కంటే ఇప్పుడు మరింత గబుక్కుమని బాధిస్తోందీ దిగులు... బండలా లోలోతులకి దిగి...

*కలికి చిలకలకొలికి మాకు మేనత్తా*
*కలవారి కోడలూ కంచి కామాక్షీ...*

వినయతో కలిసి అత్తచుట్టూ తిరుగుతూ ఆనందంగా పాడుకోవడం పూర్వజన్మ స్మృతిలా గుండె మాళిగలో దాగే వుంది.

అల్లారు ముద్దుగా, అపురూపంగా పెరిగిన అత్త, మామయ్య అధికారం కింద ఎంతగా నలిగిపోయిందో నాకు బాగా తెలుసు. అందుకే అమ్మానాన్నలకే మాత్రం యిష్టం లేకపోయినా నేను పట్టుబట్టి శీనుబావని పెళ్ళిచేసుకున్నాను. కేవలం అత్త కోసమే. అత్తకా యింట్లో ఒక ఆలంబన కావాలన్నదే నా ఆలోచన.

పెద్దబావ, శైలక్క యింట్లో వుండరు. తిరుపతిలో రియలెస్టేట్ వ్యాపారం చేసుకుంటూ... పిల్లల్ని చదివించుకుంటూ అక్కడే వుంటారు. ఎప్పుడో తప్ప యింటికి రారు... ప్చ్...

'ప్చ్... నిన్న సాయంత్రం ఆ మీటింగ్‌కి అత్తని తీసుకెళ్ళకుండా వుండాల్సింది,' నుదురు కొట్టుకుంటూ ఈ మాటని రాత్రినుండీ కనీసం పదిసార్లన్నా అనుకున్నాన్నేను.

కాకున్నా ఆ మహానుభావుడు యింటిదాకా అయినా వచ్చి అత్తని తీసికెళ్ళేవాడే. అత్త ప్రశాంతంగా వుండడాన్ని భరించలేడసలు. ప్రతిక్షణం అత్తమీద అధికారాన్ని చెలా యిస్తూ వుండాలి.

"ఘుగ్గ... జే... జే... ళే... ళే..." మంటూ లావోపాల కప్పు బద్దలయిన చప్పుడు... ఆ వెనువెంటనే బలమైన చెయ్యి ఒకటి సున్నితమైన చెంపమీద ముద్రించిన గాఢమైన శబ్దం.

గుండెల్లోపల ఏవో బండ్లు పరిగెడుతున్నట్టుగా రొద... వేదన తాలూకూ రొద... భయం తాలూకూ రొద... దిగులు తాలూకూ రొద.

వడివడి అడుగులతో వంటగదిలో కొచ్చిపడ్డ అత్తముఖం అవమానంతో ఉడికి పోతున్నట్టుగా వుంది.

ముసిముసిగా నవ్వుకుంటూ శైలజక్క బాబుకి పాలు తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

నాకు దుఃఖం వచ్చింది. బాధ ఎందుకో తెలీడంలేదు...

నాకు తెలీకుండానే వచ్చేస్తోంది. మామయ్య అరిచినప్పుడల్లా, అత్తను యిలా చూడాల్సి వచ్చినపుడల్లా కడుపులోంచో, గుండెల్లోంచో తెలీకుండా, ఉంగలు చుట్టు కున్నట్టుగా దుఃఖం.

శైలజక్క అలా నవ్వుకుంటూ వెళ్ళిన అవమానం మరింత భరింపరాకుండా వుంది. పెద్దబావ శైలజక్కని ఏమీ మందలించకపోవడం దుర్భరంగా వుంది. ఇదంతా మామయ్య ప్రవర్తన వల్లనే.

ఇదేదీ పట్టకుండా ఆదివారం పేపర్ని క్షుణ్ణంగా చదువుతూ కూర్చున్న శీనుకేసి విసుగ్గా, కోపంగా చూశాన్నేను.

నాకు అర్థంకానిదొక్కటే.

"ఇంట్లో ఏం జరుగుతోందో తెలుసుకోకుండా... ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసుకోవడం అంత అవసరమా...?" ఈ మాటే శీనుని చాలాసార్లు నిలదీస్తుంటాన్నేను.

తండ్రిని ఖండించే వయసూ, జ్ఞానమూ లేవా కొడుకులిద్దరికీ. వున్నాయి... వాళ్ళు కూడా ఆ అధికారం కిందే వున్నారు. తల్లిని అలా అనడం చాలా సహజమైన విషయంలా తోస్తుంది. తప్పేమీ కన్పడదు వీళ్ళకి.

వయసు మీద పడేకొద్దీ మామయ్య కోపమూ, పెత్తనమూ కూడా ఎక్కువవవు తున్నాయి. తన చేతుల్లో నుండి పెత్తనాన్ని, అధికారాన్ని ఎవరో లాగేసుకుంటారేమోనన్న భయంతో కాబోలు ఎవ్వరితోనూ పిసరంత చనువు కూడా ప్రదర్శించకుండా గంభీరంగా వుంటున్నాడు. ఈ క్రమంలో అత్తమీద జులుం మరింత ఎక్కువయిపోయిందీమధ్య.

ఆ అవమానాన్నీ, కోపాన్నీ అధిగమించి ఏవగింపుతో ఆరోజే అత్తని తీసుకుని వచ్చేశాన్నేను. అత్త నాతో రావడానికి యిష్టపడ్డదా, లేదా అన్నదలా వుంచితే అలా తీసుకు రావడానికి వెనక ఎన్నెన్ని అబద్ధాలో... ఎన్ని వేడికోళ్ళో... ఎన్ని మర్నింపులో...

"అయ్యో రాత్రి అత్తని మీటింగకి తీసికెళ్ళకుండా వుండాల్సింది" మళ్ళీ మరోసా రనుకున్నాన్నేను.

నిన్న సంధ్య బెల్ట్ షాపులకి మళ్ళీ లైసెన్సులు పొడిగించిన ప్రభుత్వ వైఖరిని దుయ్యబడుతూ సాయంత్రం మెంబర్ల మీటింగ్ పెట్టుకుందామంది. అనుకోకుండా ఐద్వా సభ్యులు కూడా వచ్చారక్కడికి. చాలామంది మహిళలు పోగవడంతో చిన్న మీటింగ్‌లా తయారయింది.

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, 'రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతోన్న నూతన ఎక్సైజు విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే మళ్ళీ ఉద్యమం చేపట్టాల్సి వస్తుందనీ... గ్రామీణ ప్రాంతాల్లో బార్లనీ, బెల్ట్‌షాపుల్నీ తెరిస్తే తగలబెట్టాల్సి వస్తుందనీ' ఆవేశంగా మాట్లాడింది.

మార్చి ముప్ఫయొకటితో రద్దయ్యే బెల్టుషాపుల లైసెన్సులను ప్రభుత్వం పునరు ద్ధరించడమే కాకుండా మళ్ళీ వెయ్యి షాపులకు అదనంగా లైసెన్సులివ్వడం పట్ల మహిళా సంఘాలన్నీ నిరసన తెలిపాయి. వెంటనే ఎక్సైజ్ నూతన విధానాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించాయి.

మీటింగంతా అత్త చాలా శ్రద్ధగా వినింది.

"వీళ్ళంతా ఎంతెంత ధైర్యంగా వేదికలెక్కి మాట్లాడుతున్నారే విపులా... వీళ్ళ ఇంట్లో వాళ్ళు ఏమీ అనరా?" గేటు దాటి ఆటో వద్దకి వస్తుండగా అంది అత్త ఆశ్చర్యంగా.

"లేదాంటీ అనేవాళ్ళు అంటూనే వుంటారు... అవన్నీ వీళ్ళు పట్టించుకోరు. సారా అయితేనేం, బీరయితేనేం ఏదో ఒక మందు... ఏదైనాసరే పురుషులు బానిసలయితే కుటుంబం ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా భార్యాభర్తల మధ్య గొడవలు... మొత్తం సంసారమే సర్వనాశనమైపోతుందని వీళ్ళందరికీ తెలుసు. అందుకే బార్లు రావడానికి వీలులేదని గొడవ చేస్తున్నారు," సంధ్య చెప్పింది.

"ఇదంతా వీళ్ళకెట్లా తెలుస్తుంది విపులా?"

అత్తకేసి నిశితంగా చూశాన్నేను.

తెల్లటి, నున్నటి ముఖంలో విశాలమైన నల్లటి కళ్ళు, తీర్చిదిద్దినట్లుగా వున్న కనుబొమల మధ్య దమ్మిడీ అంత మెరూన్ రంగు స్టిక్కరూ... ఏభయ్యయిదేళ్ళొచ్చినా ఏమాత్రం బరువు పెరగని శరీరం... గులాబీ రంగుకి ఆకుపచ్చ అంచొచ్చిన వెంకటగిరి జరీ చీర... మెడలో జేడ్స్‌తో కలిపి కట్టిన బంగారు గుళ్ళదండా... అత్త చాలా అందంగా అన్పించింది నాకు. పైగా యిక్కడి కొచ్చిందగ్గర్నుండీ మామయ్య సాధింపులూ, వేధింపులూ లేకపోవడం... ఇరవై నాలుగ్గంటలూ అల్లుకునే యిల్లు లేకపోవడం... కొత్త మనుషులూ, కొత్త ఆలోచనలూ అత్త మొహం చాలా తేటగా వుంది.

నా సమాధానం కోసం ఎదురుచూస్తున్నట్లుగా కళ్ళెగరేసింది అత్త.

"ఇదంతా వీళ్ళకెట్లా తెలుస్తుందంటే ఏం చెప్తాం అత్తా,.. కుటుంబాలు నాశనమై పోతూంటే వాళ్ళు నడవాల్సిన దారిని వెతుక్కుని తెలుసుకున్నారు... అందుకు సంధ్య వంటి వాళ్ళెంతోమంది సాయపడ్డారు.

"మనిళ్ళల్లో ఉదయం లేస్తే యింటి చాకిరీ, మొగుడి సేవలూ, వచ్చిన అతిథుల మంచిచెడ్డలూ... ఇల్లు తప్ప మరో ప్రపంచం ఎరక్కుండా అత్యంత సాధారణంగా జీవించేయడం... ఇలా జీవించే క్రమంలో మన గురించి మనం ఆలోచించుకోలేం. నేను కూడా మామయ్య చెప్పినట్లుగా ఉద్యోగం మానేసి నీతోపాటే మనూళ్ళో వుండి వుంటే అచ్చంగా నీలాగే యిల్లలుక్కుంటూ వుండేదాన్ని... నాకూ యివేమీ తెలిసేవికావు. ఇక్కడయితే ఆడవాళ్ళు అలాకాదు... తమ గురించి తాము తెలుసుకుని చైతన్య వంతులవుతున్నారు..." ఊపిరి తీసుకోడానికాగాన్నేను.

"ఈ సారా వల్ల తమ జీవితాలకి జరుగుతోన్న నష్టాల్ని తెలుసుకుని దూబగుంట లో సారా జీపుల్ని తరిమి కొట్టడంతో ప్రారంభమైన చిన్న తిరుగుబాటు జిల్లా అంతటా, రాష్ట్రమంతటా వ్యాపించి ఉద్యమ రూపం తీసుకుని ఎంత ప్రబలమైందో తెలిసిందే కదా... అందుకే బార్లు మళ్ళీ పెడతామని ప్రభుత్వం అనగానే స్పందించి వీళ్ళు విజృంభిం చేశారు. వాళ్ళకి బాగా తెలుసు మందు తమ జీవితాల మీద చూపించే ప్రభావం..." సంధ్య అందుకుని చెప్పింది అత్తతో.

అత్త సాలోచనగా చూసింది.

"ఓహో యిదేనా మొన్న మీ మహిళా సంఘానికి వచ్చిన స్త్రీవాద రచయిత్రి చెప్పింది... స్త్రీల స్వేచ్ఛ సాంఘిక జీవితంతో ముడివడి వుందని..."

అత్త అలా అనగానే నేనెంత ఉద్వేగపడిపోయానంటే అది రోడ్డని కూడా చూడ కుండా అత్తని కౌగిలించేసుకుని ముద్దు పెట్టేసుకున్నాను. అత్త యింత చక్కగా అర్థం చేసుకోగలగడం నాకెంతో ఉద్వేగాన్నీ, ఆనందాన్నీ యిచ్చింది. అత్త నడుం చుట్టూ నా కుడిచేతినాన్చి ఆటోవద్దకు నడుస్తూండగా జరిగిందది.

పాత ఎనభై మోడలు అంబాసిడర్ కారొకటి దూసుకుంటూ వచ్చి మా పక్కనే ఆగింది. డ్రైవింగ్ సీట్లో కూర్చున్న మామయ్య సీరియస్‌గా మా యిద్దరికేసి చూస్తున్నాడు., మామయ్య కళ్ళు మామూలుగానే ఎర్రగా వుబికినట్లుగా వుంటాయి. అవి ఉరిమినపుడు మరింత వెళ్ళుకొచ్చి అగ్ని కిరణాల్ని వెదజల్లుతున్నట్లుగా వుంటాయి.

అప్పటికే నమ్మిన బంటు నారాయణ దిగి వెనక డోర్ తెరిచి "ఎక్కండమ్మా" అంటున్నాడు.

"మామయ్యా... మరో నాలుగు రోజులుంచుకుని..." ఏదో చెప్పబోయాన్నేను మృదువుగానే.

"ప్చ్..." అంటూ మామయ్య తన కుడి అరచేతి నడ్డుపెట్టాడు.

ఆ తర్వాత మాటలు పొడిగించడానికెవరూ సాహసించరు.

ఎవరో మంత్రించినట్టుగా అత్త కారెక్కి కూర్చుంది.

నివ్వెరపోయి నిలుచున్నాన్నేను . . .

నాకెందుకో మామయ్య ముఖం చూస్తుంటే ముసలి తోడేలు జ్ఞాపకమొస్తోంది. ఆ కళ్ళు నాకెప్పుడూ తోడేలు కళ్ళలాగే కన్పిస్తాయి. ఆ కళ్ళల్లో పాశవికత తప్ప మానవత్వం కన్పించదు.

రాత్రి కంటే యిప్పుడు మరీ వేదనగా వుంది.

"విపులా... విపులా..." కారెక్కమంటూ అత్త పిలుస్తున్నట్లుగానే వుంది.

అసలెందుకొచ్చాడో ఈ మహానుభావుడు నెల్లూరికి. బహుశా బెల్ట్‌షాపులకి డిపాజిట్లు కట్టడానికొచ్చుంటాడు.

నిన్ననే లాస్ట్ డేట్. కిస్తీలో మూడోవంతు కట్టమని ప్రకటన రాగానే అయిదారు షాపులకి డిపాజిట్లు కట్టాలని తండ్రీ కొడుకు మట్లాడుకుంటూంటే విని తను ఆవేశ పడింది.

అసలారోజు గొడవంతా కూడా యిదే.

"అత్తా మనం ప్రత్యేకించి సంఘసేవ చేయకపోయినా పేద కుటుంబాలను నాశనంచేసి పొందే ఆ ఆదాయం మనకొద్దత్తా. మనకి సారాయంగళ్ళొద్దు... యింకేదయినా వ్యాపారం చేయమను మామయ్యని..."

కాఫీ యిస్తూ ధైర్యం చేసి అత్త చెప్పబోయినపుడే, లావోపాల కప్పుతో పాటు అత్త చెంప కూడా పగిలింది.

"ఇటువంటి విషయాల్లో తలదూర్చకు... ఎంతలో వుండాలో అంతలో వుండు..." శాసించబడింది.

నేననుకుంటాను... భార్యని కొట్టినందువల్ల ఏ శిక్షా వుండదు కనుకే పురుషు లంతా ఈ పని చేస్తుంటారని. బలహీనుల మీద బలవంతుల దాడి.

అవమానంతో ఎర్రబడిన అత్త ముఖం నన్నిప్పటికీ రగిలిస్తోంది.

"విపులా... విపులా... ఆఫీసుకి టయిమవుతోంది" పక్క పోర్షన్లో నుండి సంధ్య కేకలు పెట్టడంతో బలవంతంగా పైకి లేచాన్నేను .

కళ్ళు బరువుగా వాలిపోతున్నాయి. ఒళ్ళంతా విరగ్గొట్టినట్టుగా నొప్పులు.

✦ ✦ ✦

"ఇనుపరజను నతికించుకున్న అయిస్కాంతంలా ఆ యింటినీ, పనులనూ, మామయ్యనీ... అతికించుకున్నట్లుగా వుంటుంది అత్త. సంవత్సరం క్రితం మామయ్యకి యాక్సిడెంటయి తొడ ఎముక విరిగి ఆపరేషన్ చేసి స్టీల్ రాడ్ వేసినపుడయితే మూడు నాలుగు నెలలాయన్ని మంచం మీదుంచి ఎంత చాకిరీ చేసిందనుకున్నావ్... అప్పుడే నేను సెలవు పెట్టి నెలన్నర్రోజులు అత్తతోనే వున్నాను.

అదే అత్తకి మోకాళ్ళు యింత లావున వాచిపోయి ఎనిమిక్ అయి ఎంత బాధపడ్తోన్నా పట్టించుకోరు తండ్రీ కొడుకులు... ప్చ్" దీర్ఘంగా నిట్టూర్చాన్నేను.

"అది ఖచ్చితంగా ఆంటీ తప్పే" కఠినంగా అంది సంధ్య.

అత్త మీద నాకు కోపం రావడమయితే సరేగానీ... వేరే ఎవరయినా పల్లెత్తు మాటంటే కూడా ఓర్చుకోలేన్నేను.

సంధ్య, నేను ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం... సంధ్య వాళ్ళమ్మతో కలిసి వుంటోంది... వాళ్ళ పక్క పోర్షన్నోనే నేనూ వుంటున్నాను.

మొదట్లో మామయ్య, అత్త యిద్దరూ శీనూ అలా వూళ్ళో, నేను యిక్కడా వుండడాన్ని ఒప్పుకోక ఉద్యోగం మానేయమన్నారు.

దగ్గరే వుండి కుమ్ముకుంటూ, గుద్దుకుంటూ వుండడం కన్నా దూరంగా వుండి శని, ఆదివారాలు కలుసుకోవడాన్నే యిష్టపడ్డాన్నేను.

సంధ్యకీ, నాకూ స్త్రీ చైతన్యం పట్ల వున్న చిన్న అభిలాష మహిళా చేతన ఏర్పాటుకు తోడ్పడింది.

అవుట్స్కర్ట్స్‌లోని మురికివాడలకీ, యింకా వీలయినపుడు పల్లెపట్టులకీ వెళ్ళి చిన్నచిన్న మీటింగ్స్ పెడుతుంటాం... కుటుంబాల్లో సమస్యలపట్ల చాలామంది మహిళలకు కొంతమంది పురుషులకు కూడా కౌన్సిలింగిస్తుంటాం. మా మెంబర్స్‌లో ఒక రచయిత్రీ, ఒక సైకాలజిస్టు కూడా వుండడం విశేషం. మహిళా చేతన పెట్టాలన్న ఆలోచనకు అసలు మూలకారణమే అత్త.

"అసలేంటి సమస్య," నవ్వింది సంధ్య.

విరుచుకుపడ్డాన్నేను...

"అసలేంటి సమస్య..." సంధ్య ననుకరిస్తూ ఒత్తి పలికాన్నేను. వ్యంగంగా... నాకు ఊహ వచ్చినాటి నుండీ జరిగినవన్నీ ఏది చెప్పలేదు నీకు... చిన్నప్పుడు అత్తనీ,

పిల్లల్ని వదిలిపెట్టి వేరే ఆవిడతో ఊళ్ళు తిరుగుతూండేవాడని చెప్పలేదా? అత్తకూడ వదిలేసి వుంటే తాము అనాథలమైపోయుందుమని తెలిసి కూడా ఆ కొడుకులిద్దరికీ తల్లిమీద కంటే తండ్రి మీదనే ప్రేమ, గౌరవాభిమానాలు... భయం అని చెప్పలేదా? ఊళ్ళో వాళ్ళంతా కూడ యిదేదో చాలా మామూలు విషయమేనన్నట్లుగా అతడ్ని గౌరవించడం గురించి చెప్పలేదా?... బావమీద కారిపోయే ప్రేమతో కాదు కేవలం అత్త కోసమే నేనీ పెళ్ళి చేసుకున్నావని చెప్పలేదా? ఏది చెప్పలేదా నీకు... అత్త మీద మామయ్య సాధింపులూ, వేధింపులూ, ఆయన చెయ్యి విసరడాలూ చిన్న చిన్న విషయాల్లో సహా ఏది చెప్పలేదే నీకు... ఏమీ తెలీనట్లుగా ఏంటి సమస్య? అంటున్నావా..." అంటూ మోకాళ్ళలో తలదూర్చి ఏడ్చేశాను.

సంధ్య మీది కోపంతో కాదు... మామయ్య ఊళ్ళు తిరిగే రోజుల్లో అత్త పడిన వేదన మళ్ళీ మళ్ళీ గుర్తుకొచ్చి నా గొంతుకడ్డంపడి ఏడుపొచ్చేసింది.

వెక్కుతూనే వున్నాన్నేను...

నా భుజం మీద చేయి వేసి రాస్తూ, "ప్లీజ్ విపులా... కూల్‌డౌన్... అంతా మనల్నే చూస్తున్నారు."

గతుకుల రోడ్డులో నీటి ప్రవాహంలో నాటుపడవలా ఎగుడుదిగుడుగా నడుస్తోన్న బస్సులో మరింత ముడుచుకుని కిటికీ కానుకుని కూర్చున్నాను.

అసలు మామయ్యకి తప్పుకాని సంగతులంటూ ఏమయినా ఈ భూప్రపంచంలో వున్నాయా?... నాకనుమానమే.

ఒక ఇడ్లీ ఎక్కువ పెట్టినా తప్పే... అసలు పెట్టకపోయినా తప్పే.

ఆయన భోజనం చేసినంతసేపూ ఏదో అడగాలన్నట్లుగా అడగలేనట్లుగా... భయం భయంగా ఆ చుట్టుపక్కలే తిరుగుతూంటుందత్త... వాళ్ళిద్దరూ కలిసి భోజనం చేయడంకానీ, కలిసి గదిలో కెళ్ళడంకానీ నేనెప్పుడూ చూడలేదు... ఎప్పుడూ అపరిచితుల్లా మసులుతూ వుంటారింట్లో.

కూరల్లో చిటికెడు ఉప్పు తక్కువయిందనో... కోడికూర మరి కాస్త ఉడకనందుకో... ఏదో ఒక చిన్న విషయానికో, పెద్ద విషయానికో ప్రతిరోజూ క్లాసులు తీసుకోక మానడు. ఎంతమంది పరాయివాళ్ళున్నా సరే... తను అనదల్చుకున్నదేదో అనేస్తాడు. ఇవి మాత్రమే అతడు అత్తతో మాట్లాడే మాటలు.

'మంచినీళ్ళివ్వు,' అనే మాటని కూడా చాలా కర్కశంగా, భయంకరంగా అడుగుతాడాయన.

చిన్నవస్తువేదయినా కన్పడకపోతే అందుకు అత్తే కారణభూతం. 'ఈ దరిద్రపు కొంపలో పెట్టిన వస్తువు పెట్టినచోట వుండదు,' అంటాడు. అసలా యిల్లు దరిద్రపుకొంప కావడానికి తనే కారణమన్న సంగతి మర్చిపోతాడు.

'నన్ను చూశారా మీ అమ్మనెంత అదుపులో పెట్టుకున్నానో,' అంటూ కొడుకు లిద్దరికీ ప్రభోధిస్తున్నట్లుగా వుంటాడు.

"ఇదంతా నీకు ఆశ్చర్యంగా వుందేమో కానీ నాకు మాత్రం ఆశ్చర్యంగా లేదు."

కళ్ళు తుడుచుకుంటూ సంధ్యకేసి వింతగా చూశాన్నేను.

"నిజం విపులా... చిన్నప్పట్నుండీ నా చుట్టూ వున్న అనేకమంది భార్యాభర్తల్ని గమనిస్తూ బతికాను. వాళ్ళను భార్యాభర్తలు అనడం కన్నా అధికారి సేవకుడనో... యజమాని బానిసలనో అనుకోవడమే కరెక్టు... అసలలా జీవించుకుంటూ పోవడంలో ఏమాత్రం తప్పులేదని భార్యలందరి భావన..." చెప్పింది సంధ్య.

"నిజమే," నవ్వాన్నేను. "ఇదంతా చెప్తే అత్త ఒక్క ముక్క అర్థం కాలేదంటుంది... పైగా నా యింట్లో నేను బానిసనేమిటే విపులా... నీకు పిచ్చిగాని ఎక్కిందా?" అంటూ విదిలించేస్తుంది.

నిజంగా అత్త ఎంత పిచ్చిది.

'మీ మామయ్య మంచివాడే విపులా... కాకుంటే అప్పుడప్పుడూ అలా ఆవేశ మొస్తుంటుంది,' అంటుంది.

'విపులా... మీ మామయ్య కొంచెం బాగా మాట్లాడితే నాకు చాలా ఆనందంగా వుంటుంది,' అంటుంది.

అటువంటప్పుడు అత్తమీద చెప్పలేనంత కోపమూ, జాలీ, దుఃఖమూ కలుగుతాయి నాకు. మొగుడి దయకోసం, ఆయన మంచిగా మాట్లాడ్డం కోసం అంత పాకులాటేంటి? అసలు అత్తమీద ఆయన అధికారమూ, హక్కూ ఏంటి? బస్సులో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాను.

సంధ్య ఏదో చెప్పుకుపోతూనే వుంది.

"...తిట్టినా, తిమ్మినా, కొట్టినా, కుమ్మినా, కుమిలినా భర్తతోడిదే జీవితం అని స్త్రీలు నమ్మినంతవరకూ ఆ నమ్మకంతో వారు తమకు తాము ఎంత ద్రోహం చేసుకుంటున్నారో తెలుసుకునేంత వరకూ... బయట భద్రతలేని సాంఘిక పరిస్థితులున్నంత వరకూ..."

సంధ్య నీరసమైన మాటల్తో చిరాకెత్తుతోంది నాకు.

'ఇదేనా మీ రచయిత్రి ఒకామె స్త్రీ స్వేచ్ఛ సాంఘిక జీవితంతో ముడివడి వున్నది అన్నది!' అన్న అత్త మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చి అత్తమీది ప్రేమతోనూ, దిగులుతోనూ గుండె గొంతులో కొచ్చినట్టయింది... అమ్మానాన్న యిద్దరూ ఉద్యోగం సద్యోగం లేనోడితో నీ పెళ్ళేమిటని ఆగ్రహించడం... తను వ్యతిరేకించడం అన్నీ గుర్తొస్తున్నాయి... ఏవేవో ఆలోచనలు మెదడులోనుండి గుండెల్లోకీ, గుండె నుండి మెదడులోకీ పరావర్తనం చెందుతున్నట్లుగా వున్నాయి.

కొండమ్మ, వెంకటమ్మ, రంగమ్మ, చంద్రిక, లక్ష్మి వంటి వాళ్ళని సారాకి వ్యతిరేకంగా... చైతన్యం చేసినంత తేలిగ్గాదు. ఆంటీ వంటి మధ్యతరగతి ఆడవాళ్ళను లేదా ఎగువమధ్యతరగతి ఆడవాళ్ళను ఊబిలో నుండి తప్పించడం... పురుషుడి చేతిలో మాత్రమే అధికారముండే సమాజ పరిస్థితులున్నంత వరకూ యింతే. కాస్త ఆలోచన వున్న ఒకరిద్దరు ఆడవాళ్ళు తమ జీవితాలను తాము చైతన్య.

ఆ తర్వాత సంధ్య ఏం మాట్లాడుతోందో విన్పించుకోలేదు నేను. గూడూర్లో బస్సాగగానే దిగి నెల్లూరు బస్సు వద్దకు నడుస్తూంటే ఆశ్చర్యపోయింది సంధ్య, హఠాత్తుగా ప్రయాణాన్ని రద్దు చేసుకున్నందుకు. "అదేమిటి విపులా ఇదిగో మీ ఊరి బస్సు."

సంధ్య పిలుస్తోన్నా విన్పించుకోకుండా వెళ్ళి నెల్లూరు బస్సెక్కేశాను. సంధ్య కూడా నన్ననుసరించింది.

ఎందుకో యిప్పుడప్పుడే అత్తని కలవాలన్పించలేదు.

✦ ✦ ✦

"...రెండు నెలల్నుండీ ఊరికి రాకుండా బాగానే సాధించావు. నాన్నకి చాలా కోపమొచ్చింది. చెప్తే వినవు నువ్వు," మందులు ప్యాక్‌లన్నీ తీసి అలమర్లలో సర్దుతూ అన్నాడు శీను. అప్పటికి శీను యిలా అనడం పదోసారి.

"శీనూ... ప్లీజ్," అన్నాను విసుగ్గా.

కొత్త మందులషాపు ఓపెనింగు తాలూకూ హడావిడి యింకా తగ్గనేలేదు. మిత్రులూ, చుట్టాలూ కూడ యింకా ఒకరిద్దరు మిగిలే వున్నారు.

అంగట్లో మందుల ప్యాకెట్లు అందంగా అలమర్లలో సర్దుతూ యిద్దరు వర్కర్లు కొంచెం దూరంలో వున్నారు.

సర్దడం మానేసి నాకేసి నిశితంగా చూశాడు శీను.

ఏమనుకున్నాడో ఏమో చెయ్యిపట్టి షాపు వెనక పక్కనున్న చిన్న స్టోరుగదిలోకి లాక్కెళ్ళాడు. చిత్రంగా నేనూ వదలమని అడగలేదు. నా పెదవుల మీద తన పెదవుల నాన్చి గాఢంగా అద్ది మరింత దగ్గరికి తీసుకున్నాడు. అంతటితో ఊరుకోక,

"ఎంత పొగరు నీకు... మానాన్నకే ఎదురుచెప్తావా?" అని కూడా అన్నాడు.

"ఎవడికిగొప్ప?... మా అత్త మాదిరి అన్నిటికీ గంగిరెద్దులా తలూపమంటావా? ఏం ఆయన మూడు నాలుగు లక్షలు డిపాజిట్లు కట్టి బార్లకోసం ఎదురుచూడలేదూ... దాని పుణ్యాన హైకోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చింది కాబట్టి సరిపోయింది... లేదంటే మీరీపాటికి బార్లు ఓపెన్ చేసి వుండరూ... దానికంటే హీనమా ఈ మందులషాపు తెరవడం... మంచిపనే జరిగింది... ఆయననుకున్నట్టు జరగలేదని మనం అనుకున్నదేదీ జరగ్గాడదా?"

"మీ నాయిన, తాత కూడ భయపడేవాళ్ళాయనకి... నీ కెంత ధైర్యం"

"దశమగ్రహమని భయపడేవాళ్ళు వాళ్ళు... నాకా అవసరం లేదు. తప్పు చేయనంతవరకూ నేనెవరికీ భయపడను..." నా ధీమా చూసి మరింత గాఢంగా హత్తుకున్నాడు శీను తన కోపాన్ని, చిరాకుని సర్దుకుపోవడానిక్కావచ్చు.

"ఏది ఏమయినా అమ్మనీ, నాన్ననీ అలా పల్లెలో వదిలి నేనిక్కడ..." నసిగాడు మళ్ళీ.

చిర్రెత్తుకొచ్చింది నాకు.

"వాళ్ళెందుకుండాలి వూళ్ళో. పదేళ్ళ నుండీ పంటలు లేవు. ఈ సంవత్సరం ఒక మాదిరిగా పండినా వచ్చే సంవత్సరం పండుతుందన్న గ్యారంటీ లేదు. రొయ్యల చెరువులు, చేపల చెరువులు, చెరుకుతోట అన్నీ పెట్టడం, నష్టపోవడం యిదివరకున్న భూసారమే లేకుండాపోయింది. హాయిగా వచ్చి మనతో వుండమను... వాళ్ళిద్దర్నీ చాక్కుందాం."

"అదిప్పట్లో జరిగే పని కాదులే..." అంటూ షాపులోకి నడిచాడు శీను.

'ఎప్పటికయినా జరిగే తీరుతుంది. నాకు తెలుసు శీను లేకపోతే ఆయనకిచెయ్యి విరిగినట్లే,' అనుకుంటూ నేనూ శీనుని వెంబడించాను.

హడావిడిగా వచ్చింది అత్త పై నుండి.

"విపులా నేనింక బయల్దేర్తానే... మామయ్యకి కోపమొస్తుంది, ఇప్పటికే రెండు రోజులయిపోయింది."

"రెండు రోజులయి ఎక్కడున్నావత్తా నువ్వు కొడుకింట్లోనే కదా. కొడుకు కొత్తగా షాపు తెరిస్తే ఆయనే దగ్గరుండి చూడాల్సింది పోయి నిన్ను కూడా వుండనివ్వడా? కొత్త షాపు, కొత్త యిల్లు... యివన్నీ కొంచెం సర్దిపెట్టకూడదా అత్తా నాలుగురోజులుండి," నిష్ఠూరపడ్డాన్నేను .

"మీ అమ్మ వుంది కదా విపులా నన్ను పోనీమ్మా..." బతిమాలుతున్నట్లుగా అంది అత్త. అత్తకి ఎవ్వర్నీ నొప్పించడం చాతకాదు.

"విపులా అమ్మని వెళ్ళనివ్వు... నాన్న యిప్పటికే రెండుసార్లు ఫోన్ చేశాడు. ఆయన కిబ్బంది... అసలే చాలా సీరియస్‌గా వున్నాడు. ఎవర్తో వెళ్తావమ్మా... పద పంపించి వస్తాను..." అంటూ శీను అత్తని తీసుకుని బయటికెళ్ళిపోయాడు. నిర్ఘాంత పోయి చూస్తున్నాన్నేను.

'ఆయన సీరియస్‌గా వున్నారు...'

'ఆయనకి కోపమొస్తుంది...'

'నాన్న ఎదురుచూస్తుంటారు... నాన్న కిబ్బంది...'

ఆయనలా కర్కశంగా వుండడానికీ, కఠినంగా మాట్లాడ్డానికీ మొత్తం వీళ్ళే కారణం అన్పించింది.

'ప్చ్... ప్చ్. ఈ యుద్ధాన్ని ఆపడం చాలా కష్టం.'

ఇరుపక్షాల్లో మనం ఎవరినయితే బలపరుస్తున్నామో వాళ్ళే శత్రువుకి తమంత తాముగా లొంగిపోతూంటే మధ్యన మనం భంగపడ్డం తప్ప. ప్చ్..." ఆలోచనలో పడ్డాన్నేను, పని చేస్తూనే.

అయితే

'ఇప్పట్లో జరిగేది కాదులే,' అని శీను,

'ఎప్పటికయినా జరిగే తీరుతుందని,' నేనూ ఏదయితే అనుకున్నామో అది చాలా తొందరలోనే జరిగిపోయింది.

మేము షాపు ఓపెన్ చేసి రెండు నెలలు కూడా కాకముందే అత్త, మామయ్య యిద్దరూ మా దగ్గరికే వచ్చేశారు... మామూలుగా కాదు.

మామయ్యకి గుండెనొప్పి వచ్చి హఠాత్తుగా... పక్కింటివాళ్ళతో కలిసి అత్త మామయ్యని తీసుకొచ్చింది. బొల్లినేని హాస్పిటల్లో చేర్చాం.

నాకే ఆశ్చర్యంగా దుఃఖం కలిగింది.

ఈ మామయ్యను ఎన్నెన్నిసార్లు ఛస్తే బావుణ్ణు అని తిట్టుకుంది తను. మరేమిటి ఈ దుఃఖం...?

ఈ మామయ్యలోని మనిషిని కాదు... అతడిలోని పెత్తనాన్నీ, అధికారాన్నీ మాత్రమే నేను తప్పు పడ్తున్నాను అని అర్థమయింది. పురుషుడిపై స్త్రీలు ఆధారపడకుండా మొత్తం ఈ అధికార సంబంధాల్ని మార్చాల్సిన అవసరాన్ని నేను యిష్టపడుతున్నాను అని కూడా అర్థమయింది.

మళ్ళీ దుఃఖం.

అప్పు తెచ్చి డిపాజిట్లు కట్టిన డబ్బు మొత్తం బ్లాకయిపోవడం... కాంట్రాక్టు చేసిన బిల్లులు నెలల తరబడి రాకపోవడం, వ్యవసాయ రాబడి లేకపోవడం...

పెద్ద కొడుకు, కోడలూ... ఆఖరికి తను నమ్మిన చిన్నకొడుకు కూడ తల్లిదండ్రుల్ని వదిలిపెట్టి పెళ్ళాం దగ్గరికి వెళ్ళిపోవడం... అత్త మీద జులుం మరింత ఎక్కువయిపోయి... చివరికి...యిలా...

బొల్లినేనిలో సాధ్యంకాక మద్రాస్ అపోలోలో నాకు తెలిసిన డాక్టరుంటే తీసుకెళ్ళాను. నెల రోజులు సెలవుపెట్టి అక్కడే వుండి పోయాన్నేను... అత్తతోపాటు.

"పెద్దోడు, శైలజ చుట్టపుచూపుగా వచ్చివెళ్ళారు అంతే. ఒకరికిద్దరు కొడుకులుండి కూడ మొత్తం నువ్వే చూడాల్సి రావడం మీ మామయ్యకి బాధగా వుందే విపులా..." ఆ సాయంత్రం మందులషాపు నుండి రాగానే అంది అత్త.

"ఏయ్ ఎక్కడా నువ్వు," దబాయించినట్లే పిలుస్తున్నాడు.

అంటే యింతటి దీనస్థితిలో వుండి కూడా అత్తని హాయిగా 'జయా' అంటూ పేరు పెట్టి పిలవరాదా... ఏయ్ అంటూ పిలవడం కొంచెం ఆలస్యమైతేచాలు విసుక్కోవడం... చెయ్యి విసరడం... ప్చ్... ప్చ్...

కష్టం. ఈ యుద్ధాన్ని ఆపడం చాలా కష్టం.

ఈ మగాళ్ళ చేతుల్లో నుండి ఈ అధికారాన్ని ఎవరు లాక్కోగలరు? పిల్లి మెడ కెవరు గంట కట్టగలరు...

✦ ✦ ✦

మేము చెన్నై నుండి నెల్లూరుకి వచ్చి పదిరోజులయింది.

మామయ్య నెమ్మది నెమ్మదిగా కోలుకుంటున్నాడు.

సంధ్య ప్రతిరోజూ వచ్చి మామయ్యతో అరగంట మాట్లాడి వెళ్తోంది.

ఇప్పుడు మామయ్య కొన్ని కొన్ని విషయాల్లో మౌనంగా వుండిపోతున్నాడు. నేనేదయినా చెప్తే ఆలకిస్తున్నాడు.

ఆర్థిక లావాదేవీలు మనుషుల మధ్య సంబంధాల్ని యింతగా ప్రభావితం చేస్తాయని ప్రత్యక్షంగా యిప్పుడే తెలిసింది నాకు.

ఈ మొత్తం లోటుబడ్జెట్‌ని పూడ్చడానికి నాకు, శీనుకి చాలాకాలం పట్టొచ్చు. పిల్లలొద్దనుకుని నేను మంచిపనే చేశాను.

అత్త శీనుతో కలిసి మెడికల్‌షాపులో కెళ్ళి కూర్చుంటోంది.

నాకు సెలవు లేకపోవడంతో ఆఫీసుకెళ్తున్నాను మామూలుగా.

మామయ్య కోసం ప్రత్యేకంగా ఒక టి.వి. ఏర్పాటుచేశాను.

అందులో 'ఆశ' అనే లోకల్ ఛానెల్లో 'ది స్కిల్స్... ఎన్‌లైటెన్‌మెన్' అనే ఒక ప్రత్యేక కార్యక్రమం వస్తుంది. లోకల్ ఛానెల్తో కలిసి సంధ్య రూపొందించిందే అది.

మొదట్లో ఒళ్ళు మండి ఆ ఛానెల్ని పక్కకు తిప్పేసే మామయ్య యిప్పుడు క్రమం తప్పకుండా చూస్తున్నాడు.

మామయ్య మాటల్లో కర్కశత్వం తగ్గుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నాన్నేను.

అత్త పాదాలు నా మోకాళ్ళ మీదుంచుకుని ఎప్పట్నుండో దిగిపోయిన పల్లేరు ముళ్ళను ఒక్కొక్కటిగా తీయడానికి ప్రయత్నిస్తున్నాను మెల్లిగా...

*భూమిక, ఏప్రిల్-మే 2006*